







తాగునీటి.. గోస!

- జిల్లాలో మండుతున్న ఎండలకు రిమ్స్ ఆసుపత్రిలో అల్లాడుతున్న రోగులు
- పెద్దాసుపత్రిలో రోగులకు తాగేందుకు గుక్కెడు మంచినీళ్లు కరువు
- ఆవరణలో 20 బోర్లు ఉన్నా.. పని చేస్తున్నవి ఒకటి, రెండు మాత్రమే..
- నీటిని కొనుగోలు చేసి దాహం తీర్చుకుంటున్న దుస్థితి
- ఎత్తిపోతున్న బోరుబావులు.. మొదలైన నీటి కష్టాలు
- సంబంధిత అధికారులు అప్రమత్తమైతేనే అవస్థలు దూరం
- జిల్లావ్యాప్తంగా రోజురోజుకూ పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలకు.. అడుగంటిపోతున్న భూగర్భజలాలు

ఆదిలాబాద్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో రోగులు తాగునీటికి గోసపడుతున్నారు. మండుతున్న ఎండలకు దాహంతో అల్లాడుతున్నారు. జిల్లాలో పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలకు భూగర్భజలాలు అడుగంటుతుక పోవడంతో బోరుబావులు పని చేయడం లేదు. దీంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో పాటు వారి కుటుంబీకులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రతీ వార్డుకు తాగునీరు అందించి వేసవిలో నీటి కష్టాలు తీర్చాల్సిన అధికారులు.. పట్టించుకోకపోవడంతో పరిస్థితి దయనీయంగా మారింది. ఇప్పుడే ఇలా ఉంటే.. రాబోయే మే, జూన్ మాసాలలో పరిస్థితి ఎలా ఉంటుందోనని రోగులు ఆందోళనకు గురవుతున్నారు. కొందరు ఇంటి నుంచే ప్లాస్టిక్ డబ్బాలు, బాటిళ్లలో నీళ్లను తెచ్చుకుంటుండగా.. మరికొందరు బయట దుకాణాల్లో కొనుగోలు చేసి దాహన్ని తీర్చుకుంటున్నారు. అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలను చేపట్టక పోవడంతో మంచినీటి కోసం రోగులు పడరాని పాట్లు పడుతున్నారు. పేరుకే పెద్దాసుపత్రి.. కానీ తాగేందుకు గుక్కెడు నీళ్లు కూడా దొరికే పరిస్థితులు లేవంటున్నారు. అధికారుల నిర్లక్ష్యంపై ఆసుపత్రికి వచ్చిన రోగులు, వారి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అడుగంటుతున్న భూగర్భ జలాలు

రిమ్స్ ఆసుపత్రిలో మంచినీటి సమస్య తీవ్రస్థాయికి చేరుకుంది. ఆసుపత్రి ఆవరణలో దాదాపు 20 వరకు బోరుబావులు ఉన్నప్పటికీ.. ఒకటి, రెండు మాత్రమే సరిగా పని చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే కొన్ని బోరుబావులు అడుగంటుక పోవడంతో వృధాగానే మారాయి. దీంతో మున్సిపల్ ద్వారా సరఫరా చేసే మంచినీళ్ల పైనే అటు మెడికల్ కాలేజ్, ఇటు రిమ్స్ రోగులు ఆధారపడే పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో రోజురోజుకూ పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలతో రిమ్స్‌కు నీటిని సరఫరా చేయ డం కష్ట సాధ్యమవుతుందన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే స్థానిక మావల చెరువు, లాండసాంగి వాగుల్లో నీటి నిల్వలు ప్రమాదకర స్థాయికి చేరుకుంటున్నాయి. అంతేకాకుండా రిమ్స్ ఆసుపత్రికి నిత్యం రెండు వేల నుంచి మూడు వేల వరకు రోగులు వారి కుటుంబ సభ్యులు వచ్చిపోతుంటారు. ఆసుపత్రిలో ఐదు లక్షల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకును నిర్మించినా.. రోగుల అవసరాలకు సరిపడా నీటి సరఫరా కావడం లేదు. దీంతో రోగులు వారి కుటుంబ సభ్యులు ఖాళీ బాటిళ్లతో బయటకు పరుగులు తీస్తున్నారు. అంతేకాకుండా ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ.. వాటి నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.లక్షల్లో నిర్వహణ వ్యయం

రిమ్స్ ఆసుపత్రి నిర్వహణకు ప్రభుత్వం ప్రతినెలా లక్షల రూపాయలను ఖర్చు చేస్తోంది. అయినా సమస్యలు పరిష్కారం కావడం లేదు. అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు నీటి కష్టాలు తప్పడం లేదు. ఆసుపత్రికి వస్తే విడిగా మంచినీళ్ల బాటిళ్లను తెచ్చుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని రోగులు వాపోతున్నారు. కొన్ని సందర్భాల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలకు వెళ్లలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. నీటి కొరత కారణంగా తాగునీటితో పాటు ఇతర అవసరాలకు ఆసుపత్రికి వచ్చిపోయే సందర్శకులు రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. కొందరు రోగులు వారి బంధువులు ఇంటికి వెళ్లి స్నానం, ఇతర అవసరాలను తీర్చుకొని మళ్లీ ఆసుపత్రికి వస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. వేసవి పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అధికారులు మంచినీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మరమ్మతులు కరువు

ఆసుపత్రికి వచ్చే రోగులకు మంచినీటిని అందించేందుకు శుద్ధజల ప్లాంట్లను ఏర్పాటు చేసిన వాటి మరమ్మతులు చేపట్టకపోవడంతో నిరుపయోగంగానే మారి కనిపిస్తున్నాయి. వేసవి ప్రారంభమై రెండు మాసాలు గడుస్తున్నా.. ఇప్పటికీ మరమ్మతులు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు. చిన్నపాటి మరమ్మతులు చేపడితే అందుబాటులోకి వచ్చే అవకాశం కనిపిస్తుంది. ఆసుపత్రిలో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి చల్లబరిచేందుకు ఫ్రిడ్జిలను ఏర్పాటు చేసిన ఉపయోగం లేకుండానే పోయింది. ప్రారంభించిన కొద్దిరోజులకే సమస్యలు తలెత్తడంతో మరమ్మతులు చేయకుండానే వదిలేస్తున్నారు. ఆసుపత్రి బయట ఉన్న సత్యసాయి ట్రస్టు, వివిధ స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసిన చలివేంద్రాల నుంచి మంచినీటిని తెచ్చుకుని దాహం తీర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. లక్షల రూపాయలు పెట్టి దాతలు వాటర్ ప్లాంట్, ఫ్రిడ్జిలను అందజేసినా.. రోగుల దాహన్ని తీర్చడం లేదు. గతంలో మున్సిపల్ అధికారులకు ట్యాక్స్ చెల్లించడం లేదని నీటి సరఫరాను నిలిపివేయడంతో తీవ్రమైన ఇబ్బందులు ఎదురయ్యాయి. మళ్లీ అవే పరిస్థితులు కనిపిస్తున్నాయని పలువురు చెబుతున్నారు. ఇటీవల రిమ్స్ ఆసుపత్రి ఆవరణలో దాహంతో అల్లాడి ఓ వ్యక్తి మృతి చెందడం చర్చనీయాంశంగా మారింది. ఇవే పరిస్థితులు మరికొన్నాళ్ల పాటు కొనసాగితే రానున్న రోజుల్లో తీవ్రమైన పరిణామాలు ఉంటాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆసుపత్రిలో అత్యవసర సేవలు కూడా నిలిచిపోయే ప్రమాదం ఉందంటున్నారు.




రిమ్స్ ఆసుపత్రిలో పని చేయని వాటర్ ప్యూరీఫై, ఫ్రిడ్జిలు



వాటర్ బాటిల్‌తో ఆసుపత్రికి వస్తున్న వృద్ధుడు



బాలుడి దాహం తీరుస్తున్న ఓ వ్యక్తి

ఆయుధంపై పూర్తి పరిజ్ఞానం ఉండాలి

● పోలీసు శిక్షణ కేంద్రంలో జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం ● వివిధ జిల్లాల నుంచి మొత్తం 255 మంది శిక్షణ కానిస్టేబుళ్ల హాజరు



ఆయుధాల ఉపయోగంపై వివరిస్తున్న ఎస్పీ

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 24: శిక్షణలో సమయపాలనప్రతి ఒక్క ఆయుధంపై పూర్తి పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలని ఎస్పీ గౌస్‌ఆలం తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా శిక్షణ కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్న వివిధ జిల్లాల నుంచి వచ్చిన 255 మంది శిక్షణ కానిస్టేబుళ్ల శిక్షణ కేంద్రాన్ని ఎస్పీ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణ తీసుకుంటున్న కానిస్టేబుళ్ల ఆయుధాలపై ఉన్న పరిజ్ఞానాన్ని పరిశీలించారు. పలు రకాల ఆయుధాలను వాటి సామర్థ్యం, వినియోగించే పద్ధతి, తదితర అంశాలపై కానిస్టేబుళ్లకు వివరించారు. ఫైరింగ్ చేసే పద్ధతులు, ఎటువంటి అపాయం కలుగకుండా ఉంటూ శత్రువులను మట్టుపెట్టే అంశాలను, ఆయుధాలపై పూర్తి పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలన్నారు. నూతన పద్ధతులను, మెళకువలను ఉపయోగించడం వల్ల కచ్చితమైన లక్ష్యాన్ని ఛేదించే ఫైరింగ్ చేయవచ్చని సూచించారు. అలాగే సమయపాలన, క్రమశిక్షణ తప్పనిసరి అన్నారు. శిక్షణ కానిస్టేబుళ్లకు అందజేస్తున్న సదుపాయాలను, లోటుపాట్లను శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ అదనపు ఎస్పీ సి.సమ్మెయ్‌జాన్‌రావును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సి.సమ్మైజాన్‌రావు, రిజర్వ్ సబ్ ఇన్స్‌పెక్టర్లు ఎన్.రాకేష్, పి.గోపికృష్ణ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




కానిస్టేబుళ్ల శిక్షణ తీరును పరిశీలిస్తున్న ఎస్పీ గౌస్‌ఆలం



కొమురంభీం ప్రాంగణంలో ఉన్న హేమన్‌డార్ఫ్ గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న పీవో

పోటీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

● ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్త

ఉట్నూర్, ఏప్రిల్ 24: ఉమ్మడి జిల్లాలోని గిరిజన విద్యార్థులు ప్రభుత్వం నిర్వహించే పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న హైమన్‌డార్ఫ్ గ్రంథాలయాన్ని ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త సందర్శించారు. దీనిలో భాగంగా రాబోయే పోటీ పరీక్షలలో మంచి ఫలితాలను రాబట్టేలా ప్రయత్నించాలని గిరిజన విద్యార్థులకు సూచించారు. అలాగే అన్ని రకాల సబ్జెక్టుల వారీగా పుస్తకాలను అందుబాటులో ఉంచుతామని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. గ్రంథాలయానికి చేరుకుని చదువుకుంటున్న గిరిజన అభ్యర్థులకు ఆర్వో ప్లాంటు ద్వారా చల్లని నీరు అందించేలా ప్లాంటును ప్రారంభించారు. అలాగే కూలర్‌లు, ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేయించారు. ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చదువుకునే వారికి చూడాలని గ్రంథాలయం సిబ్బందిని ఆదేశించారు.



పరిశీలకుడితో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, ఎస్పీ, ఐటీడీఏ పీవో

ఆదిలాబాద్ పార్లమెంట్ సాధారణ పరిశీలకుడిగా రాజేంద్రవిజయ్

● స్వాగతం పలికిన జిల్లా ఎన్నికల అధికారి, ఎస్పీ

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 24: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ పరిశీలకుడి నియమితులైన రాజేంద్రవిజయ్‌కు స్థానిక పెన్‌గంగా గెస్ట్‌హౌజ్‌లో జిల్లా ఎన్నికల అధికారి రాజార్షిషా పూలమొక్కను అందించి ఘన స్వాగతం పలికారు. ఇందులో భాగంగా జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త, ట్రైనీ కలెక్టర్, తదితరులు ఉన్నారు. అయితే, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన ఏమైనా సందేహాలు, ఫిర్యాదులు ఉంటే ఫోన్ నెం. 8523876384 ద్వారా సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు. నేరుగా సంప్రదించాలనుకునే వారు మధ్యాహ్నం 3గంటల నుంచి 4గంటల వరకు పెన్‌గంగా గెస్ట్‌హౌజ్‌లో సంప్రదించవచ్చని సాధారణ పరిశీలకుడు తెలిపారు.



రాజేంద్రవిజయ్‌కు పూలమొక్కను అందిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి

ఏడో రోజు 12 నామినేషన్ల దాఖలు

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 24: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి 7వ బుధవారం 12 నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా రిటర్నింగ్ అధికారి రాజార్షిషా తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సక్కు తరపున మూడవసారి జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్, పార్టీ నాయకులు సాజిద్, డాక్టర్ రవికిరణ్ కుమార్, పురుషోత్తం యాదవ్, దుర్వ నగేష్‌లు నామినేషన్‌ను దాఖలు చేశారు. ఆ తర్వాత బీఆర్ఎస్ పార్టీ ముథోల్ ఇన్‌చార్జీ రమాదేవి, ఆదివాసీ తుడుందెబ్బ గౌరవ అధ్యక్షుడు బుర్స పోచయ్య, కోలం సంఘం జిల్లా అధ్యక్షుడు కొడప సోనేరావు, ఆంద్ సంఘం ఉపాధ్యక్షుడు సర్కేదత్తు, పోతింక్ శంకర్‌లతో కలిసి 4వ నామినేషన్ సెట్‌ను దాఖలు చేశారు. అలాగే బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి గోడం నగేష్ తరపున మొదటిసారి నామినేషన్ దాఖలు చేయడానికి ఎమ్మెల్యే పాయల శంకర్, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబులతో కలిసి గోడం నగేష్ నామినేషన్‌ను దాఖలు చేశారు. అలాగే బీజేపీ అభ్యర్థి తరపున రెండవ సెట్ నామినేషన్‌ను అయ్యన్నగారి భూమన్న, బీజేపీ పార్టీ పార్లమెంటరీ కో కన్వీనర్ నిర్మల్ రెండవ సెట్, మూడవ సెట్‌ను ఆరేళ్లి మల్లేష్, వేదవ్యాస్ బీజేపీ పట్టణ కార్యదర్శి, నాల్గవ సెట్‌ను పతంగే బ్రహ్మానంద్ దాఖలు చేశారు. అలాగే బీజేపీ అభ్యర్థి రాథోడ్ రమేష్ నామినేషన్ దాఖలు, అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణ మూడవ సెట్ నామినేసన్‌ను దాఖలు చేశారు. గోండ్వానా దండకారణ్య పార్టీ తరఫున కొడప వామన్‌రావు, అలాగే ఇండిపెండెంట్ రాథోడ్ సుభాష్ తరపున చాటే వినోద్ మూడవ సెట్ నామినేషన్ దాఖలుచేశారు. అదేవిధంగా ఇండిపెండెంట్లు నేతావత్ రాందాస్, కొమురం ముత్తయ్యలు లోక్‌సభ స్థానానికి నామినేషన్ వేశారు. చివరిరోజు భారీగా నామినేషన్లు దాఖలయ్యే అవకాశం కనిపిస్తుంది.




పార్టీ నాయకులతో కలిసి నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు



బీఆర్ఎస్ అభ్యర్థి తరపున నాయకుల నామినేషన్

అందమైన బోర్డు బాగుంది.. కానీ క్రీడా పరికరాలేవీ ?

ఇచ్చోడ, ఏప్రిల్ 24 : ఇచ్చోడ మండలంలోని జున్ని గ్రామంలో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణం ఇది. క్రీడా ప్రాంగణం బోర్డు బాగుంది.. కానీ క్రీడా ప్రాంగణంలో క్రీడాపరికరాలు కనిపించకపోవడం విశేషం. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద ప్రతి గ్రామానికి క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. ఈ విషయమై ఉపాధిహామీ ఏపీఓ నరేందర్‌ను వివరణ కోరగా.. జున్ని గ్రామానికి రూ. 90వేలు క్రీడా ప్రాంగణానికి నిధులు విడుదలయ్యాయని తెలిపారు. కానీ క్రీడా పరికరాలు కనిపించకపోవడంతో గ్రామానికి వచ్చిన వారంతా బోర్డును చూసి అసలు క్రీడాప్రాంగణం ఎక్కడుంది అని ప్రశ్నిస్తున్నారు.



జున్ని గ్రామపంచాయితీలో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణం బోర్డుపై పేరుకు మాత్రమే కనిపిస్తుంది ఇలా..

అదుపు తప్పిన ద్విచక్ర వాహనం.. ఒకరి మృతి

ఉట్నూర్, ఏప్రిల్24: ఉట్నూర్ మండలంలోని పులిమడుగు సమీపంలో ఉన్న మూల మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడిపోవడంతో ఒకరు మృతి చెందారు. నేరడిగొండకు చెందిన శేఖర్ ఉట్నూర్ వైపుకు భార్యమౌనిక,కుమారుడు ఆదిత్యతో కలిసి ద్విచక్ర వాహనం పై వస్తుండగా మూల మలుపు వద్ద అదుపు తప్పి పడిపోవడంతో తీవ్ర గాయాలకు గురైన భార్య మౌనిక (25) మృతి చెందింది. శేఖర్‌తో పాటు కుమారుడు ఆదిత్యకు గాయాలు కావడంతో స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు క్షతగాత్రులను తరలించారు.



బీఎస్పీ ఆదిలాబాద్ అభ్యర్థిగా బీఫాం అందుకుంటున్న జంగుబాపు

బీఎస్పీ పార్లమెంట్ అభ్యర్థిగా జంగుబాపు

ఇచ్చోడ, ఏప్రిల్ 24: బహుజన సమాజ్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా మెస్రం జంగుబాపును ఖరారు చేశారు. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో జంగుబాపుకు రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్, సెంట్రల్ కోఆర్డినేటర్ బాలయ్య చేతుల మీదుగా బీఫాం అందజేశారు. గురువారం ఉదయం ఆదిలాబాద్ బీఎస్పీ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్‌ను దాఖలు చేయనున్నట్లు అభ్యర్థి పేర్కొన్నారు.

నేటి నుంచి ఓపెన్ పరీక్షలు

ఉట్నూర్, ఏప్రిల్ 24: ఉట్నూర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాల, ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాలల్లో గురువారం నుంచి ఓపెన్ పదో తరగతి,ఇంటర్మీడియట్ పరీక్షలు ఉన్నందున 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఉట్నూర్ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 నుంచి మే 2 వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షల సమయంలో జిరాక్స్ సెంటర్లు మూసి వేయాలని ఆదేశించారు. పరీక్షలు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు నిర్వహిస్తారన్నారు. పరీక్షల్లో ఎలాంటి మాస్‌కాపీ జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆత్రం సుగుణ, శ్రీనివాస్‌రెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారమే పార్టీ లక్ష్యం

● కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 24: ప్రజా సమస్యలను తెలుసుకుంటు వాటిని పరిష్కరించడమే కాంగ్రెస్ లక్ష్యమని, తనకు ఓటేసి గెలిపిస్తే ప్రజల సేవ కోసం తన పూర్తి సమయాన్ని కేటాయిస్తానని ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. బుధవారం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో, చిల్కూరి నగర్ కాలనీలో పలువురు బీఆర్ఎస్ నాయకులతో పాటు కాలనీ వాసులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, నియోజకవర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డిలు పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు మార్పు కోరుకున్నారని అందుకే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్‌రంజాని, కౌన్సిలర్లు దర్శనాల లక్ష్మణ్, రషీద్‌ఉల్‌హక్, కాంగ్రెస్ మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆశమ్మ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మా సంతోష్, లోక ప్రవీణ్‌రెడ్డి, శ్రీలేఖ, కొండగంగాధర్, ఎంఎ షకీల్, సయ్యద్ షాహిద్‌అలీ, రాజ్‌మొహమ్మద్, దొగ్గలి రాజేశ్వర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల ప్రచారం అసెంబ్లి ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణలు కలిసి పట్టణంలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. బుధవారం స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో వాకింగ్‌కు వచ్చిన వారిని కలుస్తూ వారితో కలిసి వాకింగ్ చేస్తూ చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం కలెక్టర్‌చౌక్‌లో ప్రచారం నిర్వహించారు. ఇందులో మాజీ జడ్పీటీసీ కొండ గంగాధర్, పత్తి ముజ్జు, రఫీక్, భరత్ వాఘ్మారే, ఖయ్యుం, మహేందర్, నాగర్కర్‌శంకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ ఫలితాల్లో బాలికలదే పైచేయి

● రాష్ట్రవ్యాప్తంగా ఆదిలాబాద్ జిల్లాకు మొదటి సంవత్సరంలో 9వ, ద్వితీయ సంవత్సరంలో 13వ ర్యాంకు ● ఫస్ట్ ఇయర్‌లో 9,577 మంది పరీక్షలకు హాజరు కాగా.. 5,860 మంది ఉత్తీర్ణత ● సెకండ్ ఇయర్‌లో 9,309 మంది పరీక్షలకు హాజరు కాగా.. 6,165 మంది పాస్ ● వివరాలు వెల్లడించిన డీఐఈవో రవీందర్

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 24: ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి వెంకటేశం విడుదల చేశారు. గత సంవత్సరం కంటే ఈ సారి ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఫలితాలు తగ్గగ, మొదటి సంవత్సరం ఫలితాలు మెరుగు పడ్డాయి. గత సంవత్సరం 10, 12వ స్థానాల్లో ఉండగా మొదటి సంవత్సరంలో 9వ, ద్వితీయ సంవత్సరంలో 13వ ర్యాంకును ఆదిలాబాద్ జిల్లా సాధించింది.ప్రతిసారిలాగే ఈ సంవత్సరం కూడా బాలికలే పై చేయి సాధించారు. కాగా బాలుర కంటే బాలికలే అత్యధికంగా ఉత్తీర్ణులయ్యారు. జిల్లా వ్యాప్తంగా మొదటి సంవత్సరానికి 9577 మంది పరీక్షలకు హాజరు కాగా 5860 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలికలు 3426, బాలురు 2430 కాగా సెకండియర్‌లో 9309 పరీక్షలకు హాజరు కాగా 6165 మంది పాస్ అయ్యారు. ఇందులో బాలికలు 3595, బాలురు 2570 మంది ఉన్నారు. మొత్తంగా ఇంటర్‌లో 61.5, ద్వితీయ సంవత్సరంలో 62.38 శాతంగా నమోదు అయ్యింది. ఈ సందర్భంగా డీఐఈఓ రవీందర్ మాట్లాడుతూ ఇంటర్ ఫలితాల్లో విద్యార్థులు మంచి ప్రతిభను చాటారన్నారు. ఆన్‌లైన్ నుంచి విద్యార్థులు షార్ట్‌మెమోలను పొందవచ్చని తెలిపారు. ఈ నెల 25 నుంచి మే 2వ తేదీ రివేరిఫికేషన్, రీ కౌంటింగ్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. మే25 నుంచి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలుంటాయని తెలిపారు.ఫెయిల్ అయిన విద్యార్థులు సంబంధిత కళాశాలలో పరీక్ష ఫీజులు చెల్లించుకోవాలని సూచించారు.

ఉట్నూర్: ఇంటర్మీడియట్ బోర్డు బుధవారం ప్రకటించిన ఫలితాల్లో బాలికలదే పై చేయి కనిపిస్తుంది. ఉట్నూర్ మండల కేంద్రంలోని చైతన్య జూనియర్ కళాశాలలో ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో రిషిత 452 మార్కులు సాధించగా పవార్ సందీప్ 439, దాసండ్ల అశ్విని 428, జాదవ్ కార్తిక్ 413, వేణుగోపాల్ 361 మార్కులు సాధించారు. బైపీసీ ప్రథమ సంవత్సరంలో ఎం.శైలజ 375, బి.సోనాలి 359, కె.అశ్విని 351 మార్కులు సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో బాదావత్ సచిన్ 962, ఆర్ సచిన్ 910 అన్నుబాబు 918, అక్షయ్ 909, బైపీసీ ద్వితీయ సంవత్సరంలో కె.వరుణ్ 945, టి.ప్రవీణ్ 944 మార్కులు సాధించారని ప్రిన్సిపల్ బూర ప్రకాస్ తెలపారు. ఇదిలా ఉండగా ఏఆర్ఎస్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో అన్సరాకానం 434, అహ్మద్ అన్నానూదిన్ 417, బైపీసీ ఫస్ట్ ఇయర్‌లో జోహార్ తషీం 427, అమినా ఫాతిమా 422, హెచ్‌ఈసీ ఊర్దు మీడియం తశ్రీం 467, మహిక్ తస్లీమ్ 405, ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో మసిరనాజ్ 914, బైపీసీలో జోహార్ పాతిమా 966 హెచ్‌ఈసీ ఉర్దూ మీడియంలో మాధ్య షరీన్ 678 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ రాజ్‌కుమార్ తెలిపారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ కళాశాలల సిబ్బంది ఎవరు కూడా ఇంటర్మీడియట్ ఫలితాలు వెల్లడించడానికి అందుబాటులో లేరు.



నేరడిగొండ కేజీబీవీలో ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన అంజలి, సుష్మిత



ఫస్టియర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన నేరడిగొండ ప్రభుత్వ కళాశాల విద్యారులు

● ఇంటర్‌లో వంద శాతం రిజల్ట్

నేరడిగొండ: ఇంటర్మీడియట్ ఫలితాల్లో కేజీబీవీ నేరడిగొండ పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో బైపీసీ సెకండీయర్ వందశాతం, ఎంపీసీ సెంకడీ యర్ ఫలితం వచ్చింది. అలాగే ఫస్ట్ ఇయర్‌లో బైపీసీలో 84శాతం, ఎంపీసీలో 61 శాతం ఫలితాలు వచ్చాయి. అంతేకాకుండా బైపీసీ సెకండీయర్‌లో జి.అంజలికి వెయ్యి మార్కులకు గాను 906 మార్కులు, బైపీసీ సెకండీయర్‌లో సుష్మిత వెయ్యి మార్కులకు గాను 925 మార్కులు సాధించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

అలాగే, నేరడిగొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సంబంధించి బుధవారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాలలో విద్యార్థిని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఎంపీసీ విభాగంలో పేల్యాడ్ హారతి 858 బైపీసీ విభాగంలో సముద్రాల అభినయ శ్రీ 900, సీఈసీ విభాగంలో జాదవ్ పృథ్విరాజ్ 727 మార్కులు అలాగే ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో మౌనిక 368, బైపీసీ విభాగంలో అశ్విని 357, సీఈసీ విభాగంలో లింగు 359 మార్కులు సాధించడం జరిగంది. ద్వితీయ సంవత్సరంలో 130 మంది విద్యార్థిని విద్యార్థులకు 117 మంది ఉత్తీర్ణత, ప్రథమ సంవత్సరంలో 132 మందికి 87 మంది ఉత్తీర్ణత సాధించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. టీటీడబ్ల్యూఆర్‌జేసీ బుగ్గారాంలో ప్రథమ సంవత్సరంలో 69 మందికి గాను 55 ఉత్తీర్ణత సాధించగా ద్వితీయ సంవత్సరంలో 56 మందికి 55 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఆయా కళాశాల ప్రిన్సిపల్‌లు సభానాత రన్నం, రజిత, కృష్ణవేని తెలిపారు. వారు విద్యార్థులను అభినందించారు.



ఇంటర్మీడిట్ పరీక్ష ఫలితాలలో సత్తా చాటిన సాయిలింగి కేజీబీవీ విద్యార్థులు

● సత్తా చాటిన కేజీబీవీ విద్యార్థినులు

తలమడుగు: మండలంలోని సాయిలింగి కస్తూరిబా గాంధీ పాఠశాల విద్యార్థులు మరోసారి సత్తా చాటారు. బుధవారం వెలుబడిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ఫస్ట్ ఇయర్ సెకండ్ ఇయర్ పరీక్ష ఫలితాల్లో 98శాతం ఉత్తీర్ణ సాధించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ సువర్ణ తెలిపారు. ఉత్తీర్ణతకు సహకరించిన విద్యార్థులు అధ్యాపకుల కృషి ఫలితంతోనే ఉత్తీర్ణత సాధించడం జరిగిందని, ఆమె పేర్కొన్నారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ 96, సెకండియర్ పరీక్ష ఫలితాల్లో 98శాతం ఉత్తీర్ణత సాధించారు. అదే విధంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 78శాతం సాధించారని కళాశాల ప్రిన్సిపల్ మాధవరావు తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను కళాశాలవి విద్యార్థులు గ్రామస్థులు జిల్లా అధికారులు అభినందించారు.

నాలుగు నెలల్లోనే బయటపడిన నిజస్వరూపం

● బీజేపీఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ● పార్టీ అభ్యర్థి నామినేషన్ ర్యాలీలో భారీగా తరలివచ్చిన ప్రజలు, నాయకులు

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 24: మోసపూరిత మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ నిజస్వరూపం నాలుగునెలల్లోనే బయటపడిందని బీజేపీఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ నామినేషన్‌కు పార్లమెంట్ నియోజకవర్గం నలుమూలల నుంచి ప్రజలు, నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీ రాంలీలా మైదానం నుంచి ప్రారంభమై ఎన్టీఆర్ చౌక్ మీదుగా కొమురంభీంచౌక్ వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే, పార్లమెంట్ ఇన్‌చార్జీ పాయల శంకర్, ముథోల్ ఎమ్మెల్యే రామారావ్‌పటేల్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబులు పాల్గొన్నారు. అనంతరం మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల ఆదిలాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలలో ఓడిస్తే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని సీఎం హోదాలో దిగజారి మాట్లాడుతున్నారని అన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థాని బీజేపీ కైవసం చేసుకోవడం ఖాయమని, గోడంనగేష్ రెండు లక్షల మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా కేంద్రంలో సమర్థవంతమైన, పటిష్టమైన ప్రభుత్వం కొనసాగిందని, దేశ భవిష్యత్తు కోసం మళ్లీ ఆ ప్రభుత్వాన్ని ఎన్నుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. పార్లమెంట్ నియోజకవర్గంలో మరికొన్ని సమస్యలు పరిష్కారం కావాల్సి ఉన్నాయని, ఆ సమస్యలను సమూలంగా పరిష్కరించుకోవడానికి మీ ప్రతినిధిగా పార్లమెంట్‌కు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ రాథోడ్‌రమేష్, పార్లమెంట్ ప్రభారి అల్లాపూర్ శ్రీనివాస్, పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, సీనియర్ నాయకులు సత్యనారాయణగౌడ్, నిర్మల్ మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, రాష్ట్ర నేత రావుల రాంనాథ్, మూడు జిల్లాల అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, పాయల శంకర్, ఎంపీ అభ్యర్థి గోడం నగేష్



ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

ఉపాధిహామీ పనుల్లో నిర్లక్ష్యం వీడాలి

ఆసిఫాబాద్, ఏప్రిల్ 24: ఉపాధిహామీపనుల్లో నిర్లక్ష్యం చేయవద్దని, పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ దీపక్‌తివారి అన్నారు. బుధవారం కలెక్ట రేట్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్య తగ్గడంపై వివరణ కోరారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నవారిపై వెంటనేచర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉపాధిహామీ సిబ్బందికి పనులపై స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. గ్రామ అవసరాల మేరకు పనులపై తీర్మానం చేయాల న్నారు. అర్హులైన కూలీలందరికీ పనికల్పించాలని సూచించారు. కూలీలహాజరు మొబై ల్‌యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. సకాలంలో వేతనాలు చెల్లిం చాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది సమన్వయంతో వెళ్తేనే ఫలితాలు బాగుంటాయన్నారు. వేసవిదృష్ట్యా పని ప్రదేశాల్లో తాగునీరు, నీడతోపాటు అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీవోలు, కార్యదర్శులు, ఈజీఎస్ ఎఫ్ఏలు, టీఏలు పాల్గొన్నారు.

యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి: ఎస్పీ

ఆసిఫాబాద్, ఏప్రిల్ 24: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. బుధవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, పిల్లలు, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులలో ఎవరైనా మత్తు పదార్థాలకు బానిసలు అయినట్లయితే వారివివరాలను తమకు తెలియ జేయాలన్నారు. వారిని డీ అడిక్షన్ సెంటర్‌ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించి మత్తుపదా ర్థాలను మానిపించే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ సురేష్‌కుమార్



● కారు దిగి కాంగ్రెస్‌లో చేరుతున్న నేతలు
● ఆయన ఎంట్రీపై స్పష్టతనివ్వని కాంగ్రెస్ పార్టీ
● బీఆర్ఎస్ మీటింగ్‌లకు ఐకెరెడ్డి డుమ్మా

నిర్మల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మొన్నటి వరకు మూడు శాఖలకు మంత్రిగా కొనసాగిన జిల్లా అంతటా రాజకీయంగా ఆధి పత్యం కొనసాగించడమే కాకుండా ఇంటి నిండా మంది మార్బలంతో గడిపిన ఇంద్రకరణ్‌రెడ్డి అనూహ్యంగా బీఆర్ఎస్ పార్టీకి దూ రమై కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు జర్యూపుతున్న ప్రయత్నాలు ఆయనకు రాజకీయంగా ఒంటరి వాడిని చేస్తున్నాయన్న ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్ పార్టీ సమావేశాలకు దూరమైన కాంగ్రెస్ పార్టీలో చేరాలని ప్రయత్నిస్తున్నప్పటికి ఇంద్రకరణ్‌రెడ్డికి ఇప్పటి వరకు ఆ పార్టీ అధిష్టానం నుంచి గ్రీన్‌సిగ్నల్ లభించడం లేదు. అయితే ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని ఇక్కడి జిల్లా పార్టీ నాయకులంతా తీవ్రంగా వ్యతిరేకిస్తుండడంతో అధిష్టానం సైతం డైలామాలో పడింది. దీంతో ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ లో చేరే అంశంపై ఇప్పట్లో తేలేట్లు లేదంటూ చాలా మంది ఆయ నను సన్నిహితంవగా ఉన్న సీనియర్ నాయకులు, అనుచరులందరు వరుస కట్టి కాంగ్రెస్ పార్టీలో చేరుతుండడం ఆసక్తిని రేకేత్తిస్తోంది. ఐకెరెడ్డి వద్ద నిన్న మొన్నటి వరకు నెంబర్ టూ, త్రీలుగా కొనసాగి, అన్ని తామై వ్యవహరించిన నేతలే ప్రస్తుతం ఆయనను వదిలేసి కాంగ్రెస్ పార్టీలో చేరిపోతున్నారు. కనీసం తాము పార్టీ మారబోయే విషయంపై ఇంద్రకరణ్‌రెడ్డికి సమాచారం ఇవ్వకుండా వారు తమ దారి తాము చూసుకుంటుండడం చర్చకు తావిస్తోంది. దాదాపు నెల రోజులు గడుస్తున్నప్పటికి ఇంద్రకరణ్ రెడ్డి చేస్తున్న ప్రయత్నాలు ఫలించపోతుండడం పట్ల కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక కాంగ్రెస్ నేతలు, ముఖ్యంగా డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావుతో పాటు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు తదితరులు మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిపై పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు ఉన్నట్లు అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. దీంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఐకెరెడ్డి చేరికను వ్యతిరేఖిస్తూ ఆందోళనలు కూడా చేశారు. క్షేత్రస్థాయిలో ఫీడ్ బ్యాక్ తీసుకున్న అధిష్టానం ఇప్పటికి ఆయన చేరిక వ్యవహారాన్ని పెండింగ్‌లోనే పెట్టింది. అయితే ఇంద్రకరణ్‌రెడ్డి మాత్రం కాంగ్రెస్‌లో చేరే ప్రయత్నాలను ఇప్పటికి విరమించడం లేదంటున్నారు. మొదట మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో ప్రయత్నాలు చేశారని, ఆ తరువాత రాజ్యసభ సభ్యులు కేశవరావుతో కూడా కాంగ్రెస్‌లో చేరే విషయమై ప్రయత్నాలు చేసినప్పటికీ అధిష్టానం మాత్రం ఇప్పటి వరకు స్పందించడం లేదు. ఇటీవలే ఆయన నిర్మల్‌లో తన అనుచరులతో సమావేశమై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. వారం పది రోజుల్లో తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని ఆయన అనుచరుల సమక్షంలో ప్రకటించారు. ఈ సమావేశానికి హజరైన చాలా మంది నాయకులు కేవలం రెండు రోజుల్లోనే ఇంద్రకరణ్‌రెడ్డి సమాచారం ఇవ్వకుండానే కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. ప్రస్తుతం ఈ అంశం జిల్లా అంతటా ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. రోజు రోజుకు మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి సన్నిహితులైన వారంతా కాంగ్రెస్ పార్టీలో చేరిపోతుండడం, ఆయన సముదాయిస్తున్నప్పటికి వినకుండా తమ దారి తాము చూసుకుంటుండడంతో ప్రస్తుతం ఆయన ఒంటరిగా మారిపోయారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మొదట్లోనే సన్నిహితుల దెబ్బ

చాలా యేళ్ల నుంచి మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డికి అత్యంత సన్నిహితులుగా ఉన్న సిర్పూర్ కాగజ్‌నగర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిలు ఆయనకు సమ్యాచారం ఇవ్వకుండానే సొంత నిర్ణయంతో కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. అయితే వీరిద్దరూ ఇంద్రకరణ్‌రెడ్డికి అత్యంత సన్నిహితులు కావడంతో ఆయన సలహా మేరకే వీరు పార్టీ మారారన్న ప్రచారం మొదట్లో జరిగింది. ఇంద్రకరణ్‌రెడ్డి కూడా పార్టీ మారబోతున్నారన్న సంకేతాలు వెలువడ్డాయి. దీనికి అనుగుణంగానే బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల కీలక సమావేశానికి ఆయన హాజరుకాకుండా దూరంగా ఉన్నారు. దీంతో పాటు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రస్థాయి నేతలందరికి ఆయన అందుబాటులో ఉండకుండా దూరంగా ఉంటున్నారు. ఇలాంటి కారణాలతో ఆయన ఎట్టి పరిస్థితుల్లో పార్టీ మారబోతున్నారన్న ప్రచారం మొదలైంది. దీనికి అనుగుణంగానే ఇంద్రకరణ్ రెడ్డి కూడా రాష్ట్రస్థాయి నేతలతో కాంగ్రెస్‌లో చేరే విషయమై చాలా రోజుల నుంచి ముమ్మరంగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఆయన ప్రయత్నాలను అడ్డుకుంటూనే డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు వర్గం వ్యూహాత్మకంగా ఇంద్రకరణ్ రెడ్డి అనుచరులందరినీ ఒక్కొక్కరిగా కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంటోంది. ఇలా నిర్మల్ నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ మాజీ ప్రజా ప్రతినిధులు, ప్రస్తుత ప్రజా ప్రతినిధులు సైతం వరుస కట్టి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. కాంగ్రెస్‌లో చేరుతున్న వారిలో ఇంద్రక్యారణ్ రెడ్డికి చాలా సన్నిహితులైన వారు అలాగే ఆయన సామాజిక వర్గానికి చెందిన వారు కూడా ఉండడం చర్చనీయాంశమవుతోంది.


స్థానికంగా ఐకేరెడ్డికి ఝలక్

మొదటి నుంచి ఇంద్రకరణ్‌రెడ్డి ఏ పార్టీలోకి మారిన ఆయన వెంట నడిచిన వారే ప్రస్తుతం ఆయనను వదిలిపెట్టి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. ఇంద్రకరణ్‌రెడ్డి తెలుగుదేశం పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి కాంగ్రెస్ పార్టీ నుంచి వైఎస్ఆర్ సీపీకి ఆ పార్టీ నుంచి బహుజన సమాజ్ పార్టీకి ఆ తరువాత బీఆర్ఎస్ పార్టీలోకి మారిన సంగతి తెలిసిందే. ఇలా ఇంద్రకరణ్‌రెడ్డి పార్టీ మారినప్పుడల్లా చాలా మంది అనుచరులు, సీనియర్ నేతలంతా ఆయన వెంట నడిచారు. ఇప్పుడు మాత్రం ఆయనను వదిలిపెట్టి కాంగ్రెస్‌లో చేరుతూ ఆయనను ఒంటరిగా మారుస్తున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిర్మల్‌కు చెందిన ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్‌తో పాటు సర్పంచ్‌లు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు అలాగే సారంగాపూర్ మండలానికి చెందిన రవీందర్‌రెడ్డి, రాజ్‌మహ్మద్, అడెల్లి పోచమ్మ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డితో పాటు చాలా మంది కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. కాగా దిలావర్‌పూర్ మండలంలో చాలా మంది సీనియర్ నాయకులు ఆయన ప్రమేయం లేకుండానే కాంగ్రెస్‌లో చేరిపోయారు.

ఇంటర్ ఫలితాల్లో ముథోల్ విద్యార్థుల ప్రతిభ

ముథోల్, ఏప్రిల్ 24 : ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలు బుధవారం విడుదల కావడంతో మండలంలోని ఆయా కళాశాలల్లోని విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారు. ముథోల్‌లోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మొదటి సంవత్సరంలో 97.5 శాతం, ద్వితీయ సంవత్సరంలో 85.9 శాతం ఫలితాలు వచ్చినట్లు సంబంధిత ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు. ఇందులో ఎంపీసీ విద్యార్థి సిహెచ్‌రఘు 1000 మార్కులకు గాను 931 రాగా బైపీసీలో క్రాంతిరతన్ 1000 మార్కులకు గాను 951 మార్కులు సాధించారు. అలాగే తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల కళాశాలలో మొదటి సంవత్సరంలో 97.43 శాతం రాగా, ద్వితీయ సంవత్సరంలో 96.87 ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. ఇందులో ద్వితీయ సంవత్సరం బైపీసీ విద్యార్థి బనవతి పామ బుజ్జి 1000 మార్కులకు గాను 969 రాగా, ఎంపీసీ విద్యార్థి సి. అఖిల 903 మార్కులు సాధించారు. అలాగే మైనార్టీ బాలికల కళాశాలలో మొదటి సంవత్సరంలో 93 శాతం, ద్వితీయ సంవత్సరంలో 81 శాతం ఉత్తీర్ణత సాధించగా ఎంపీసీ విద్యార్థి రింశాఖానం 925 మార్కులు రాగా బైపీసీ విద్యార్థి సనా ఫాతిమా 946 మార్కులు సాధించారు. అలాగే కస్తూరిబాలో మొదటి సంవత్సరంలో 84 శాతం ఉత్తీర్ణత సాధించగా ద్వితీయ సంవత్సరంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. మొదటి సంవత్సరంలో ఎంపీహెచ్‌డబ్ల్యూ విద్యార్థి 500 గాను 459 మార్కులు సాధించగా ద్వితీయ సంవత్సరం విద్యార్థి 1000 మార్కులకు గాను 922 మార్కులు సాధించారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జనరల్‌లో మొదటి సంవత్సరంలో 51 శాతం, ద్వితీయ సంవత్సరంలో 41 శాతం, ఒకేషనల్‌లో మొదటి సంవత్సరంలో 72 శాతం, ద్వితీయ సంవత్సరంలో 74 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు సంబంధిత అధ్యాపకులు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులను అభినందించారు.







పోటా పోటీ

- ఎన్నికల సమాలోచనలో రాజకీయ పార్టీలు
- మొదలైన అంతర్గత సర్వేలు
- సామాజిక మాధ్యమాల బాధ్యుల నియామకం
- రంగంలోకి కోవర్టులు, ఇన్‌ఫార్మర్‌లు
- ఫిరాయింపుల కోసం సీనియర్‌లకు బాధ్యతలు
- అసంతృప్తి నేతలకు బుజ్జగింపులు

నిర్మల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : పొలిటికల్ సెంటర్‌గా పిలుచుకునే జిల్లాలో రోజురోజుకు అనూహ్య రాజకీయ పరిణామాలు చోటు చేసుకుంటుండడంతో ఇక్కడ అంతా ఎన్నికల వాతావరణం కనిపిస్తోంది. గత నాలుగు నెలల క్రితం వరకు దూకుడుగా వ్యవహరించిన బీఆర్ఎస్ పార్టీ ఒక్కసారిగా నీరుగారిపోవడంతో ఇక్కడ అంతా బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్యనే పోటీ రసవత్తరం కానుందంటున్నారు. అయితే జిల్లాకు చెందిన బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావులు తమ పార్టీల బలాలు, బలహీనతలతో పాటు గెలుపు అవకాశాలపై అంతర్గత సర్వే నిర్వహింపజేసుకుంటున్నారన్న ప్రచారం జరుగుతోంది. హైదరాబాద్‌కు చెందిన ప్రైవేటు ఏజెన్సీలు గత వారం రోజుల నుంచి ఈ ఇద్దరు నేతల గెలుపోటముల అవకాశాలపై సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొంటున్నారు. ఈ సర్వే ఏజెన్సీల ప్రతినిధులు పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద అలాగే జనసంచారం ఎక్కువగా ఉన్న చోట వివరాలను సేకరిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ సర్వేలు ఎన్నికల వరకు కొనసాగించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు పేర్కొంటున్నారు. రహస్యంగా జరుగుతున్న ఈ సర్వేల వ్యవహారం ప్రస్తుతం అంతటా చర్చనీయాంశంగా మారింది. సర్వే నివేదికల ప్రకారం ఈ నేతలు ఎన్నికల వరకు వ్యూహ ప్రతివ్యూహాలతో పోటాపోటీ కార్యక్రమాలు చేపట్టి ఓటర్లకు మరింత చేరువయ్యే ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆ నేతల వర్గీయులు బాహాటంగానే పేర్కొంటున్నారు. ముఖ్యంగా బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి జిల్లాలోని మూడు నియోజకవర్గాలతో పాటు మిగతా నాలుగు నియోజకవర్గాల్లో సర్వే వ్యవహారాన్ని పకడ్బందీగా నిర్వహింపజేస్తున్నారంటున్నారు. ఆయన రాష్ట్రంలోని ఇతర లోక్‌సభ నియోజకవర్గాల్లో కూడా బీజేఎల్పీ నేత హోదాలో ప్రచారం నిర్వహిస్తున్నప్పటికీ ఇక్కడి లోక్‌సభస్థానంపై మాత్రం ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇటీవలే ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ శోభారాణి సత్యనారాయణ గౌడ్‌ను ఆయన వ్యూహాత్మకంగా బీజేపీలోకి చేర్పించి ఆయన ద్వారా బీసీ వర్గ ఓట్లను సాధించే దిశగా పావులు కదుపుతున్నారంటున్నారు. దీంతో పాటు డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు సైతం బీజేపీతో పోటాపోటీగా సర్వేలతో పాటు క్షేత్రస్థాయిలో తమ కేడర్ ద్వారా ఫీడ్‌బ్యాక్ తీసుకొని ప్రచారపర్వాన్ని హోరెత్తించేందుకు సిద్ధమవుతున్నారంటున్నా రు. జిల్లాలో ఇన్‌చార్జీ మంత్రి సీతక్క ద్వారా క్యాంపెయినింగ్ చేపడుతూ గ్రామ గ్రామాన ప్రచారం చేపట్టే దిశగా ఆయన అడుగులు వేస్తున్నారంటున్నారు. ముఖ్యంగా పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణక్కతో ఆయన జిల్లాలో ఎక్కువ ప్రచార పర్వాన్ని చేపట్టే విధంగా షెడ్యూల్‌ను ఖరారు చేశారు.

సోషల్ మీడియా వేదికగా..

కాగా అధికార కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తమ పార్టీ కార్యక్రమాలతో పాటు ప్రత్యర్థి పార్టీల లోపాలను ఎత్తి చూపేందుకోసం సోషల్‌మీడియాను అస్త్రంగా మలుచుకుంటున్నాయి. ఇప్పటికే ఈ మూడు పార్టీలు గ్రామస్థాయిలో తమ కార్యకర్తలు, సానుభూతిపరులు, అనుచరులతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకున్నాయి. ప్రతీరోజూ పత్రికల్లో వచ్చే కథనాలతో పాటు పార్టీ కార్యక్రమాలను వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ చేస్తున్నారు. దీనికోసం గానూ మండల స్థాయిలో సోషల్ మీడియా ఇన్‌చార్జీలను కూడా ఈ పార్టీలు నియమించుకున్నాయి. వాట్సాప్ గ్రూపులతో పాటు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్ లాంటి సోషల్ మీడియా వేదికలను అనుకూలంగా మలుచుకునేందుకోసం కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు పోటీ పడుతుండడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. లోక్‌సభ నియోజకవర్గ పరిధి విశాలంగా ఉన్న కారణంగా నాయకులు, పార్టీ అభ్యర్థులు ఇంటింటా ప్రచారం చేపట్టడం కష్టతరంగా మారనుండడంతో సోషల్ మీడియా ప్రచారాన్నే వారు నమ్ముకుంటున్నారు.

రంగంలోకి కోవర్టులు, ఇన్‌ఫార్మర్‌లు..

కాగా ప్రధానపార్టీలు తమ ప్రత్యర్థుల సమాచారం అలాగే వారి రాజకీయ కదలికలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు గాను రహస్యంగా కోవర్టులను, ఇన్‌ఫార్మర్‌లను నియమించుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కోవర్టులు, ఇన్‌ఫార్మర్‌ల ద్వారా ప్రత్యర్థుల సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అందుకు కౌంటర్ వ్యూహాలను కొనసాగించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ప్రధానపార్టీలన్నీ రహస్యంగా ఈ కోవర్టు ఆపరేషన్‌లను నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా చేరికల వ్యవహారంపైనే ఈ కోవర్టులు దృష్టి సారిస్తున్నారంటున్నారు. ప్రధాన పార్టీల నేతలు, నాయకులపై ప్రత్యర్థి పార్టీలు నజరానాలతో గాలం వేస్తూ ఫిరాయింపుల పర్వాన్ని కొనసాగిస్తున్న క్రమంలో ముందస్తు అప్రమత్తత కోసం పార్టీలు సిద్ధమవుతున్నాయంటున్నారు. ఇందులో భాగంగానే ఈ కోవర్టు ఆపరేషన్‌లను ఎన్నికల వరకు యధావిధిగా కొనసాగిస్తూ ప్రత్యర్థుల లోపాలను తెలుసుకొని గెలుపు అస్త్రాలను ప్రయోగించాలని భావిస్తున్నాయి.

అసంతృప్త నేతలకు గాలం..

కాగా ప్రధాన పార్టీల్లోని అసంతృప్త నేతలకు గాలం వేసేందుకు ఎదుటి పార్టీలు వ్యూహాలు చేస్తున్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. గత కొద్ది రోజుల నుంచి జిల్లాల్లో జరుగుతున్న రాజకీయ పరిణామాలతో చాలా మంది నేతలు పార్టీలు ఫిరాయిస్తున్న సంగతి తెలిసిందే. మరికొంతమంది నేతలు కూడా పార్టీలు మారే అవకాశాలున్నట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ప్రధాన పార్టీలు బుజ్జగింపుల పర్వానికి శ్రీకారం చుడుతున్నట్లు పేర్కొంటున్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు వేరు వేరుగా ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీపై దృష్టి సారించాయి. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీకి చెందిన చాలా మంది నేతలు మెజార్టీగా కాంగ్రెస్‌లో చేరగా కొంతమంది ముఖ్య నేతలు బీజేపీలో చేరారు. అయితే ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీలో జడ్పీ చైర్‌పర్సన్ కొరిపల్లి విజయలక్ష్మి, ఆమె భర్త, మాజీ డీసీసీబీ చైర్మన్ రాం కిషన్ రెడ్డి, పట్టణాధ్యక్షులు మారుగొండ రాములతో పాటు తదితరులు మాత్రమే ఆ పార్టీలో మిగిలిపోయారు. వీరిని తమవైపు తిప్పుకునేందుకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఇప్పటికే తమ వంతు ప్రయత్నాలు మొదలుపెట్టాయంటున్నారు.

ప్రచారం ప్రకటనలకు అనుమతులు ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 24 : టీవీ ఛానళ్లు, వార్తా పత్రికల్లో రాజకీయ ప్రకటనలు ఇవ్వాలంటే ఎంసీఎంసీ అనుమతి తప్పనిసరి అని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. బుధవారం ఎంసీఎంసీ సభ్యులతో సమావేశం నిరవహించారు. పెయిడ్‌న్యూస్ గుర్తించాలన్నారు. వ్యయ విభాగానికి రిపోర్టులు అందించాలని సూచించారు.

గడువులోగా పనులు పూర్తి చేయాలి : కలెక్టర్

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 24 : అమ్మ ఆదర్శ పాఠశాల పనులను గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. జిల్లాలోని 672 పాఠశాలల్లో త్రాగునీరు, విద్యుత్, టాయిలెట్, తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఫైజాన్ అహ్మద్, డీఆర్డీవో విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులకు

మెరుగైన సేవలు అందించాలి

- జిల్లా ఎస్ఈ జేఆర్ చవాన్



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న అపరేషన్ అండ్ మెయింటెన్స్ సిబ్బంది, ట్రాన్స్‌కో అధికారులు

భైంసా, ఏప్రిల్ 24: ప్రణాళికబద్ధమైన విధుల నిర్వాహణ ద్వారా విద్యుత్ వినియోగదారులకు నాణ్యతతో కూడిన మెరుగైన సేవలు అందించాలని ట్రాన్స్‌కో ఎస్ఈ జేఆర్ చవాన్ సూచించారు. బుధవారం పట్టణంలోని రాహుల్‌నగర్ కాలనీ పరిధిలోని ఒక ఫంక్షన్ హాల్‌లో భైంసా, బాసర సబ్ డివిజన్ పరిధిలోని అపరేషన్ అండ్ మేయింటెన్స్ సిబ్బంది, అధికారులకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో పాల్గొని మాట్లాడారు. అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. క్రమం తప్పకుండా విద్యుత్ మీటర్ల నిర్వాహణ, లైన్ల పర్యవేక్షణ చేపట్టాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వాహణ వ్యవస్థలోని లోపాలను ఎప్పటికప్పుడు సరిచేసుకోవాలన్నారు. అనధికార విద్యుత్ వినియోగంపై దృష్టి సారించి ప్రమాదాల నివారణకు అప్రమత్తతతో విధులు నిర్వహించాలన్నారు. విద్యుత్ సిబ్బంది భద్రతా చర్యలను పాటిస్తూ విధులు నిర్వహించాలన్నారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించారు. ఇందులో డీఈలు శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, ఏడీఈలు ఆదిత్య, లక్ష్మణ్‌లతో పాటు ఏఈలు సబ్ ఇంజనీర్లు, రెండు సబ్ డివిజన్ల పరిధిలోని అపరేషన్ అండ్ మేయింటెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సరఫరాను పునరుద్ధరించాలంటూ

కిసాన్‌గల్లీవాసుల ఆందోళన



నీటి కోసం ఆందోళన చేస్తున్న కిసాన్‌గల్లీ వాసులు

భైంసా, ఏప్రిల్ 24 : తమ కాలనీకి నిలిచిన పోయిన మిషన్ భగీరథ నీటి సరఫరాను పునరుద్ధరించాలంటూ భైంసా పట్టణ పరిధిలోని కిసాన్‌గల్లివాసులు ఆందోళనలు చేపట్టారు. బుధవారం ఉదయం వేళలో కాలనీవాసులు ఖాళీ బిందెలు, నీటి పాత్రలతో ప్రధాన రోడ్డు మార్గంపైకి తరలివచ్చి భైఠాయించి రాకపోకలను అడ్డుకున్నారు. గత వారం రోజులుగా నిలిచిపోయిన మిషన్ భగీరథ నీటి సరఫరా వ్యవస్థను పునరుద్ధరించాలని ఎన్ని మార్లు విజ్ఞప్తి చేసిన మున్సిపల్ అధికారులు పట్టించుకోకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ కాలనీవాసులు ఆందోళనలకు దిగారు. వారం రోజులుగా తాము నీటి కోసం పడరాని పాట్లు పడుతున్న పట్టించుకునే వారు కరువయ్యారని కాలనీవాసులు వాపోయారు. కాలనీవాసులకు మద్దతుగా బీజేపీ పట్టణ కమిటీ మాజీ అధ్యక్షుడు గాలి రవి ఆందోళనల్లో పాల్గొన్నారు.సంబంధిత సమాచారం అందుకున్న టౌన్ సీఐ రాజారెడ్డి ఘటన స్థలికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడి సముదాయించారు.. మున్సిపల్ నీటి సరఫరా సిబ్బంది సైతం ఘటన స్థలికి చేరుకొని సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలియచెప్పడంతో కాలనీవాసులు ఆందోళనలను విరమించారు.

భారీ ఆధిక్యతే లక్ష్యంగా పాటుపడాలి

- బీజేపీ శ్రేణులతో ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్



భైంసాలో బీజేపీ ప్రతినిధుల ప్రదర్శన

భైంసా, ఏప్రిల్ 24 : లోక్‌సభ ఎన్నికల్లో ఆదిలాబాద్ స్థానంలో పార్టీ అభ్యర్థి నగేష్‌కు నియోజకవర్గ పరిధి నుంచి భారీ ఆధిక్యతను అందించేందుకు శక్తివంచన లేకుండా బీజేపీ ప్రతినిధులు పాటుపడాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పిలుపునిచ్చారు. బుధవారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో బీజేపీ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీ శ్రేణున్నీ కార్మోణ్ముకులుగా కావాలన్నారు. బూత్ స్థాయి నుంచి ఎన్నికల ప్రచార పర్వాన్ని చేపట్టాలన్నారు. గడిచిన దశాబ్ద కాలంగా ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం హయంలో జరిగిన విశేష అభివృద్ధి, సాధించిన విజయాలు, చేపట్టిన సంస్కరణలు, సంక్షేమ పథకాలు, ప్రగతి పనులను వివరిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటా వివరించాలన్నారు. కార్యకర్తల చేతిలోనే పార్టీ భవితవ్యం ఆధారపడి ఉంటుందన్నారు. లోక్‌సభ పార్టీ అభ్యర్థి నగేష్ గెలుపులో ముథోల్ నియోజక వర్గ పరిధి నుంచి ప్రధాన భాగస్వామ్యం అందించాలన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ నాయకత్వాన్ని బలపరుస్తూ బీజేపీ శ్రేణులు ప్రదర్శనలు చేపట్టాయి. ఇందులో ముథోల్ నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల, భైంసా పట్టణ పరిధిలోని బీజేపీ ప్రధాన శ్రేణులు పాల్గొన్నాయి.

అన్నదాతకు తప్పని చివరి కష్టాలు

- ఓవైపు నీరందక ఎండుతున్న వరి పంట
- మరోవైపు చేతికి అందిన పంట నీటిపాలు చేసేలా హడలెత్తిస్తున్న వాతావరణం
- జిల్లాలో మిశ్రమ వాతావరణంతో రైతన్నకు తప్పని తిప్పలు



కడెం మండలం సారంగాపూర్‌లో నీరందక ఎండిన వరి పంట

ఖానాపూర్, ఏప్రిల్ 24 : ఆరుగాలం శ్రమించి పండించిన వరి పంట చివరిదశకు చేరుకోగానే అన్నదాతకు ఎనలేని తిప్పలు తలెత్తుతున్నాయి. జిల్లాలో ఓవైపు పెరుగుతున్న ఉష్ణోగ్రతతో భూగర్భ జలాలు అడుగంటి వ్యవసాయ బావులు ఎండిపోతున్నాయి. ఓవైపు ఎస్సారెస్పీలో ఆశించిన స్థాయిలో నీళ్లు లేక పంట కాలువలకు సరిపడా నీరు అందడం లేదని రైతులు చెబుతున్నారు. దీంతో ఆయకట్టు చివరిలో ఉన్న పంటపొలాలు ఎండి పోవాల్సిన పరిస్థితి తలెత్తుతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ముందస్తుగా సన్నద్ధమై నాట్లు వేసుకున్న రైతులు వరి కోతలు పూర్తి చేసుకున్నారు. పంట చేతికి అందిన రైతులను సైతం వాతావరణం హడలెత్తిస్తోంది. దీంతో జిల్లాలోని వరి రైతుకు మిశ్రమ వాతావరణం తలనొప్పిగా మారింది.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో అడుగంటుతున్న భూగర్భ జలాలు

జిల్లాలో నానాటికీ ఉష్ణోగ్రతలు పెరిగి పోతున్నాయి. దీంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటడంతో వ్యవసాయ బావుల్లో నీరు ఇంకిపోయి ఆశించిన స్థాయిలో పంటలకు సరిపోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క నిర్మల్ జిల్లాలోని ప్రధాన పంట కాలువైన సరస్వతి, సదర్మాట్ కాలువలకు పూర్తిస్థాయిలో నీరు రాని పరిస్థితి నెలకొంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో సరిపడా నీరు లేకపోవడంతో పంట కాలువలకు ఒక దశలో సాగునీరు ఇవ్వకపోవడంతో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, నిర్మల్ డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావులు ఎస్సారెస్పీ ప్రాజెక్టును సందర్శించి సదర్మాట్, సరస్వతి కెనాల్‌లకు నీటిని విడుదల చేయాలని సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసు కెళ్లి నీటిని విడుదల చేయించాల్సిన పరిస్థితి తలెత్తింది. అయినప్పటికీ చివరి ఆయకట్టు వరకు సరిపడా నీరు అందడం లేదని రైతులు చెబు తున్నారు. ఓవైపు పంట కాలువలకు సరిపడా నీరు రాక.. మరోవైపు వ్యవసాయ బావుల్లో నీరు లేక.. పంట పొలాలు ఎండిపోయే పరిస్థితి తలెత్తిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హడలెత్తిస్తున్న వాతావరణం...

జిల్లాలో ఓవైపు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో భూగర్భ జలాలు అడుగంటి నీరందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఓవైపు ఉంటే మరోవైపు చేతికి అందిన పంటను నీటిపాలు చేసేం దుకు సై అంటున్న వాతావరణం అన్నదాతను హడలెత్తిస్తోంది. పంటకాలువలతో సంబంధం లేకుండా వ్యవసాయబావులపై ఆధారపడి జిల్లాలో పలువురు రైతులు ఈ యాసంగి సీజన్‌లో వరి పంటను సాగుచేశారు. వ్యవసాయబావులపై ఆధారపడి వరి పంటను సాగు చేసిన రైతులు ముందస్తుగానే నాట్లు వేసుకోవడంతో సదరు రైతుల పంట ప్రస్తుతం కోత దశకు చేరుకుంది. ఇదివరకే జిల్లాలో పలువురు ముందస్తుగా నాట్లు వేసుకున్న రైతులు వరికోతలు చేపట్టారు. దీంతో చేతికొచ్చిన ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు పంట కల్లాల్లో ధాన్యం కుప్పలు పోసి సిద్ధంగా ఉంచారు. ఈ దశలో గత పది రోజులుగా నిత్యం జిల్లాలో ఏదో ఒక ప్రాంతంలో ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తుండడం తో సదరుధాన్యం తడిసిపోయే పరిస్థితి తలెత్తుతుంది. దీంతో తాము పండించిన పంటను కాపాడుకునేందుకు నానా తంటాలు పడాల్సిన పరిస్థితి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా జిల్లాలో మిశ్రమ వాతావరణం అన్నదాతకు కంటి మీద కునుకు లేకుండా చేస్తుందని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రోజురోజుకూ బావిలో

నీళ్లు అడుగంటుతున్నాయి

- కుమ్మరి సతీష్, యువరైతు, సారంగాపూర్



గత కొద్ది రోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు రోజు రోజుకు బావిలో నీళ్లు అడుగంటుతున్నాయి. దీంతో పొలానికి నీళ్ల సరిపోక ఓ పక్క ఎండుతోంది. ఇన్నాళ్లు ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి పండించుకున్న పంట ఇలా భూగర్భ జలాలు అడుగంటడంతో చివరి దశలో ఎండిపోవాల్సిన పరిస్థితి తలెత్తింది.

మారుతున్న వాతావరణం

ఆందోళన కలిగిస్తోంది

- రామిడి మహేష్, యువరైతు, తర్లపాడ్, ఖానాపూర్



గత వారం రోజులుగా మా గ్రామంలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. వరి ధాన్యం సేకరించి పంట కల్లాల్లో ఆరబెడుతున్నాం. ప్రస్తుతం వాతావరణం మారుతుండడంతో చేతికి అందిన ధాన్యం ఎక్కడ నీటి పాలవుతుందోనని ఆందోళనగా ఉంది. నిత్యం ధాన్యాన్ని ఆరబెట్టడం ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడంతో వెంటనే కుప్పచేసి టార్పాలిన్ కవర్లు కప్పడం పారిపాటిగా మారింది.



ఖానాపూర్ మార్కెట్ యార్డ్‌లో వరి ధాన్యంపై టార్పాలిన్ కవర్ కప్పుతున్న రైతులు



సారంగాపూర్ వ్యవసాయబావిలో అడుగంటిన నీరు

ఇంటర్మీడియట్‌లో లక్ష్మణచాంద విద్యార్థుల ప్రతిభ

లక్ష్మణచాంద, ఏప్రిల్ 24 : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల కళాశాల, సహకార జూనియర్ కళాశాల విద్యార్థులు బుధవారం వెలువడిన ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. కేజీబీవీ కళాశాలకు సంబంధించి సీనియర్ ఇంటర్‌లో 1000 మార్కులకు గాను బైపీసీ విభాగంలో కే. రక్షిత 972, ఎండీ అర్షియా 972, ఏ. అక్షయ 926 మార్కులు సాధించి కళాశాల టాపర్స్‌గా నిలిచారు. ఎంపీసీ విభాగంలో బి. రాధిక 907, జి. శైలు 852, బి. అశ్విని 845 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారు. జూనియర్ ఇంటర్‌లో 470 మార్కులకు గాను ఎంపీసీ విభాగంలో కే. రాఘవి 432, జి. వెన్నెల 422, ఎం. శ్రీనిధి 416 మార్కులతోను, బైపీసీ విభాగంలో ఎస్. శైలజ 400, సిహెచ్. సాత్విక 395, జి. సోనీ 384 మార్కులతోను ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ కళాశాల మొత్తం మీద జూనియర్ ఇంటర్‌లో 84.28 శాతం, సీనియర్ ఇంటర్‌లో 96.22 శాతం ఉత్తీర్ణత సాధించి శభాష్ అనిపించుకున్నారు. ఇక సహకార కళాశాలలో సీనియర్ ఇంటర్మీడియట్‌కు సంబంధించి 100 మార్కులకు గాను ఎంపీసీ విభాగంలో కందుల చంద్రశేఖర్ 935 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచారు. రాథోడ్ అరూష్ 890, బోండ్ల భీమ లక్ష్మీ 837, పోతుగంటి శోభారాణి 762 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారు. బైపీసీ విభాగంలో గడ్డం నవ్య 778, కొండూరి అమూల్య 775, ఎదుల రాణి 767, జాదవ్ అంకిత 725, బర్ల వైష్ణవి 718, తలారి రమ్య 717 మార్కులతో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. జూనియర్ ఇంటర్‌లో 470 మార్కులకు గాను ఎంపీసీ విభాగంలో ఉప్పు నందిని 353, ఓస శ్రీనిక 326, బైరబోయిన నారాయణమ్మ 317 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారు.